# ముగురు పెళ్లాండ్రలోనూ తెలివిమంతురాలు ఎవతె?

కవికొండల వేంకటరావుగారు.

రామవర్మ కూతుళ్లు ముగ్గురు. వరసగా పెద్దమ్మాయి, చిన్నమ్మాయి, చిట్టమ్మాయి అని పిలవడమే కాని పేర్లుపెట్టి పిలవక పోవడంచేత చాలాకాలం వఱకూ వాళ్ల పేర్లెవరికీ తెలియవు. పెద్దదిగి వారివారి మగలతో కాపరాలుచేస్తూ వచ్చిందాకా ఎవరికీ తోచలే, "పేర్లుపెట్టి పిలవాలి ఆడపిల్లల్ని, పెద్దమ్మాయి, చిన్నమ్మాయి, చిట్టమ్మాయి అని పిలవకూడదు. పిలిచినా వాళ్ళు పలకరు" అని

అదెట్లా సంభవించిందంటే, పెద్దమ్మాయిని రామవర్మవాళ్లూ పెద్దమ్మాయి యని పిలుస్తూంటే పెద్దమ్మాయి మగడో నాఁడు, "పెద్దమ్మాయి యేమిటి పెద్దమ్మ దద్దమ్మ" అని కినిసేడు. అది చూచి చిట్టమ్మాయి మగడు "చిట్టు పొట్టు తవుడు దూగరకంటె నయంకదా?" అన్నాడు. చిన్నమ్మాయి మగడు చిరునవ్వునవ్వుతూ తన భార్యమొగంకేసి చూచినాడు. భార్య "అనండి మీకుతో చినమాట మీరనండి చిన్ని చిన్ని త్రొక్కుడుబిళ్లా" అని అంది. "నిన్నవందే నీకంత ఉడుకుల మోత్తనం ఎందుకే?" అంది రామవర్మభార్య.

అప్పట్నుంచి మదాలస, త్రిజట, ప్రమద, అని వాళ్లవాళ్ల అసలు పేర్లను పిలుస్తూ వచ్చేరు ఇంటిల్లిపాదీ.

మాటో మాటోనాడు అల్లుళ్లంతా అత్తారింటికి వచ్చిఉన్న రోజుల్లో ఓ మధ్యాహ్నం త్రిజట పెనిమిటి త్రిజటతో "నీపేరు రాక్షసిపేరు" అన్నాడు. "పోనీలెండి మీరు పిల్చేదిలేదుగా పేరుపెట్టి. ఓయి, ఆయి, ఓంకాయి అనేగా! రాక్షసిపేరవితేం దేవత పేరవితేం" అంది త్రిజట. "కాని త్రిజటకల అంటే మహామొక్కుడైంది" అన్నాడు మగడు. "నెమలికలమా?" అంది పడుచు. "కలం కాదు కల" అన్నాడు ప్రియుడు. "కలానికాకుండా కలకూడా అధిక్యత వుందా లోకంలో. నాకు రోజూరోజూ వస్తూనే వుంటుంది కల. ఈసరికెన్నికలలు కన్నానో లెక్కాపత్రం లేదు" అంది పిల్ల. అంటూ నిద్రపోయింది. మగడామెనిదర నిజంనిదరా యుత్తుత్తినిదరా అని యోజించడం మొదలెట్టేడు.

"కలలుఅంటే మనష్యులు కల్లలుగా తోసేస్తారు. కాని యిప్పుడు నాయీనల్లభ అనుభవించే కల నిజమైందని నాకుతట్టుతూవుంది. నిజంగా జరుగుతూ వున్నట్టుగానే నాకు గోచరిస్తూవుంది." అని అనుకుంటూ త్రిజట మగడు త్రిజట నిదరపోతూవున్నప్పటి ముఖాబ్జంమీది మునుజెమ్మట గమనిస్తూ కుడిచేడు.

ఇదంతా వాళ్లపడగ్గదిలో. ఈవల ఆవేళకు మదాలస, తనతండ్రియైన రామవర్మకడ కూర్చుండి పుస్తకం చదువుతూ అర్థం చెబుతూంది. ప్రమద ఆపక్కనే పెద్ద చట్రంమీద మోపి ఓచిత్తరువు లిఖిస్తూంది. రామవర్మ అడిగేడు "ఏదీ త్రిజట ఏంచేస్తోంది" అని. ఏమోఏమో అనుకొన్నారు అంతా. ఆ అనుకోవడంలోనే ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ మగని దగ్గఉందని సూచించినారు.

త్రిజటమగడావలకువచ్చి "ఏంవిటి. లేపమంటారాయేం? నిదరోతూంది" అన్నాడు. రామవర్మ నవ్వుతూ "అడిగానోయి! అంతే" అన్నాడు. ప్రమద "బాబయగారూ అస్తమానం మొద్దు నిద్దరేనండి దానికి. బొమ్మలు రాయదు. పుస్తకం చదవదు. మాటాడితే నిదర" అంది. మదాలస ప్రమద

పెంచి "నీకు పుస్తకం చదవడం చేతనవునా?" అంది. ప్రమద "నీకు బొమ్మలురాయడం చేతనవునా?" అంది. రామవర్మ నవ్వుతూ "త్రిజట కెల్లాడైనా మీకున్నంత చురుకూ తెలివి తేటలూ లేవర్రా" అన్నాడు. ఆమాట మామగా రన్నప్పుడు త్రిజట మగడు పరధ్యానంగా కొంచెం దూరాన్నుండి పోయేడు. లేకుంటే జవాబు చెప్పేవాడే.

కాస్సేపటికి త్రిజట వళ్లువిఱుచుకుంటూ కళ్లు నులుపుకుంటూ లేచి, తనదగ్గఱ మగనికోసం చూచి, లేకపోవడంతోనే నడవలోకి వచ్చింది. రామవర్మ భార్య అప్పటి కావనీ యీవనీ చక్కబెట్టుకొని వంటింట్లోంచి నడవలోకి వస్తూ "ఎవరికి చురుకు లేదు. తెలివి తేటలు లేవంటున్నారు" అంది గట్టిగా. అప్పటికి అల్లుళ్లు ముగ్గురు అక్కడేవున్నారు, దగ్గఱగా "అప్పుడే విన్నావు? నీకే" నన్నాడు రామవర్మ. ప్రమద అంది "కాదే నీక్కాదే చిన్నక్క" కంది. "అదిగో చిన్నక్కంటేచూడు. త్రిజటక్కను." అన్నాడు త్రిజట మగడు మఱదల్ని. తనపేరు మగ డుచ్చరించేడని నుంత నవ్వుకుంది త్రిజట, పెళ్లంపేరు పైకన్నాడని తక్కినవాళ్లంతా మఱింత గందరగోళంగా నవ్వుకున్నారు.

త్రిజట అప్పుడందర్నీ ఊరుకోమని,అంది "నాకో కలొచ్చింది వింటారా?" అని. "ఓస్ కలేనా?" అని మొదట మదాలస అంది కాని తుదకంతా "ఏది చెప్పు వింటాం అయినా గానీ" అన్నారు.

"నాకు ఱెక్కలొచ్చాయి, నే నాకాశంలో వున్నానట" అంది త్రిజట. అంటే ప్రమద "ఆకాశంలో వుంటే మేఘాలుచుట్టేసుకోవే" అంది. త్రిజట "చుట్టేసుకోకేం? చుట్టేసుకొని చుట్టేసుకొని చుట్టేసుకోవడంలో వూఱికే ఊమాఱిపోవడం మొదలెట్టాయి ఓమాటు సింహంలాగు ఓమాటు లేడిలాగు ఓమాటు మనిషిలాగు ఓమాటు మానులాగు." అంది. "అయితే మాట్లాడేవు మేఘంతో?" అంది మదాలస. త్రిజట "మాట్లాడకేం? మహాచక్కా మాట్లాడాను. ఏవూరెడతావు అని అడిగింది మేఘం నన్ను. అడిగితే దాని చెవిలో చెప్పాలనుకుని ముందుకు వంగేసరికి చెవిలాగున్నదల్లా కన్నై పోయింది. కంటికి చూపిద్దాము నేనెళ్లేవూరని యనుకొనేసరికి కన్నులాగున్నదల్లా నోరై పోయింది. నోరల్లా ముక్కైపోయింది. కొంతసేపటికంతా తలలా జుత్తులాగై పోయింది. మఱి కొంతసేపటికి తలాలేదు గిలాలేదు అంతాగిలాబా చేసిన గోడలా గడ్డంగా నిలిచి పోయింది. ఇక దేనికి చెప్పనా అని యూరుకున్నాను." అని చెప్పింది. "అలాఐతే ఱెక్కలున్నాగానీ నీకద్దేదో ఒహటి కలిగిందన్నమాటే" అంది తల్లి. తండ్రి అన్నాడు "అయితే ఱెక్క లాడించుకుంటూ పోతూంటే మేఘం పటాపంచలు గాలే?" అని. దానికి జవాబు త్రిజట ఏమి చెబుతుందా అని మదాలస మగడు ప్రమద మగడు పరకాయించి చూస్తున్నారు త్రిజటను. "తెలివైనవాళ్లెవరన్నావుంటే బాబయ్యగారి ప్రశ్నకు జవాబు చెబుతారు?" అంది త్రిజట. ఎవరి మట్టుకు వారంతా ఊరుకున్నారు. "నిజమే బాబయ్యగారడిగిన సంగతి గొప్పసంగతే. ఱెక్కలాడుతూ వుంటే మేఘం పటాపంచలు గాకుండా గోడల్లే అడ్డుంటుందా?" అని అనుకున్నారు.

"ఒయి మీయింట బటారంగాను. నేచెప్పేది కలన్నమాట మఱచిపోయినార్రా" అని విఱగబడి నవ్వింది త్రిజట. "ఉత్తతెలివి తక్కువ వాళ్లు మీరంతా" అంది కూడాను.

దానిమీద త్రిజటమగ డుడుక్కున్నట్లై "నీ తెలివికి నీవే సంతోషించాలి గోడల్లే మేఘమడ్డుండిపోతే ఏలా లేచి వచ్చావిల్లా నీవిప్పుడు?" అని అడిగేడు. త్రిజట అంది "నా ఱెక్కల విసురుకు పోలేదుగాని మేఘం దానంతటది వానకురిసి మాయమైంది" అని. "వాన?" అన్నాడు మగడు. "కల్లో వానంటే మొగమ్మీద పోసే చెమటన్నమాట" అంది త్రిజట. "ఓసీ ప్రియురాలా! మేలుకుండే సేవచేయించుకున్నావు నాచేత? ఇప్పుడొప్పుకొన్నాను తెలివైనదానివని" అన్నాడు త్రిజట మగడు.

మగడొప్పుకొంటే అంతా ఒప్పుకొన్నట్టే.